# యువత సేవా భావం పెంపొందించుకోవాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** యువత అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలని, సేవా భావం పెంపొందించుకోవాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలోని మహి ఫంక్షన్ హాల్‌లో జైపూర్ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం, ఓపెన్ హౌస్ కార్యక్రమాలను ఆయన డీసీపీ భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీపీ విధి నిర్వర్తనలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని పేర్కొన్నారు. వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ చేపట్టే సేవా కార్యక్రమాలకు ప్రజలు, యువత సహకరిస్తే పోలీసులు మరింత ఉత్సాహంగా పనిచేయగలరని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుమూల ప్రాంతాలను సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో సేవలు




అందించడం పోలీస్ శాఖ ప్రత్యేకత అని తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రమాదస్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు.

### ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ అందరినీ ఆకట్టుకుంది. ప్రజా రక్షణ, షీ టీమ్స్, భరోసా సెంటర్‌లు, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, ఫింగర్ ప్రింట్ డివైస్‌లు, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్ పరికరాలపై అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరికరాలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపు, పోలీస్ వ్యవస్థపై సానుకూల దృక్పథం కలిగించే లక్ష్యంతో చేపట్టిన ఈ ఓపెన్ హౌస్ వారికి ప్రేరణగా నిలిచింది. స్నిఫర్ డాగ్స్ ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకోగా, వారు ఆసక్తిగా వీక్షించారు. ఈ ఏసీపీ ఆర్.ప్రకాశ్, సీఐ వేణు చందర్, దేవేందర్, బన్సీలాల్, నరేష్, ఎస్ఐలు శ్రీధర్, సంతోష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య లక్ష్యం

## సకల సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు : జిల్లా కలెక్టర్



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** ద్రప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న పాత గదులను తొలగించి, నూతన భవన నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. విద్యుత్ కనెక్షన్ల లోపాలు ఉంటే సంబంధిత విభాగాలకు తెలియజేయాలని, ప్రతి పాఠశాలలో త్రాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీగోడలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలన్నారు. మధ్యాహ్న భోజన వంటగదులలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎ.ఎక్స్.ఎల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులను సమర్ధవంతంగా అమలు చేయాలని, ఉపాధ్యాయులు తమ గుర్తింపు కార్డులను వెంటనే తీసుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో దృష్టి సారించాలని, ప్రతి పాఠశాలలో నెలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సబ్జెక్ట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠాలు సమర్ధవంతంగా అమలవుతున్నాయో లేదో పర్యవేక్షించాలని తెలిపారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తగిన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, నాణ్యత సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉద్యోగం కాదు .. స్వయం ఉపాధి సృష్టించుకోండి!



- ఎన్టీపీసీ సీఎస్సార్-సిడి, దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

**శెనార్తి మీడియా, రామగుండం :** గ్రామీణ మహిళల్లో స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి పెంపు లక్ష్యంగా ఎన్టీపీసీ సీఎస్సార్%-%సిడి విభాగం ఆధ్వర్యంలో, దీప్తి మహిళా సమితి సమన్వయంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కుట్టు నైపుణ్యాలను అభ్యసించి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే దిశగా ప్రోత్సాహం లభించనుంది. ఈ శిక్షణ కార్యక్రమం ఓకేషనల్ ట్రైనింగ్ సెంటర్, సాయి సేవ సమితి వద్ద మూడు నెలలపాటు కొనసాగనుంది. కుట్టు శిక్షణలో పాల్గొనదలచిన మహిళలు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మూడు నెలలపాటు జరగబోయే ఈ శిక్షణకు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలు అర్హులు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ నవంబర్ 7, 2025గా నిర్ణయించారు. సీట్లు పరిమితంగా 50 మాత్రమే అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం జి. కార్తీక్ (ఫోన్: 8106044670), చిలుముల శంకర్ (ఫోన్: 9794180335)లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని నిర్వాహకులు వివరించారు.

# ఒకే ఇంట్లో రెండుసార్లు చోరీ చేసి పట్టుబడిన దొంగ

## 12 లక్షల రూపాయల బంగారం, నగదు స్వాధీనం

**శెనార్తి మీడియా, కరీంనగర్:** కరీంనగర్ రూరల్ పరిధిలోని తీగలగుట్టపల్లి రెవెన్యూ కాలనీలో ఈ సంవత్సరం ఫిబ్రవరి, జూన్ నెలల్లో ఒకే ఇంట్లో రెండుసార్లు దొంగతనం జరిగిన ఘటనలో పోలీసులు నేరస్తుడిని అరెస్టు చేశారు. కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి, సీసీఎస్ సీఐ ప్రకాష్ గౌడ్ కేసును ఛేదించారు. మహ్మద్ ముస్తాక్ (తండ్రి అక్బర్), తీగలగుట్టపల్లి రెవెన్యూ కాలనీకి చెందిన వ్యక్తి. ఇతడు ఆన్లైన్ బెట్టింగ్ యాప్ "డాష్ రమ్మీ"లో గత రెండేళ్లుగా ఆడుతూ లక్షల్లో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయాడు. వాటిని తీర్చడానికి దొంగతనానికి పాల్పడ్డాడు. ఇదే సంవత్సరం ఫిబ్రవరి, జూన్ నెలల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, ఒకే ఇంట్లో రెండుసార్లు కిటికీ గ్రిల్ తొలగించి చొరబడి బంగారం, నగదు దొంగిలించాడు. అనంతరం జూబ్లీ నగర్‌లోని మరో ఇంట్లోకి చొరబడి టీవీని కూడా దొంగిలించాడు. దొంగిలించిన బంగారం అమ్మేందుకు కోదాడ వెళ్లి ప్రయత్నించినా కొనేవారు లేక తిరిగి తీగలగుట్టపల్లికి వచ్చాడు. అక్కడి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, సిబ్బంది వెంటపడి పట్టుకున్నారు. ముస్తాక్ వద్ద నుంచి 91 గ్రాముల బంగారం, రూ.5 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి, సీసీఎస్ సీఐ ప్రకాష్ గౌడ్, ఎస్సై లక్ష్మారెడ్డి, హెచ్‌సీ హసనుద్దీన్, పిసిలు శేఖర్, ఖలీఫా, శ్రీరాములు, సల్మాన్‌లను సీపీ గౌష్ ఆలం, ఏసీపీ విజయ్‌కుమార్ అభినందించి నగదు రివార్డు అందజేశారు.



# నిధులు డైవర్ట్ చేస్తే ఊరుకోను..!

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, అక్టోబర్ 29 :** మోడీ సర్కారు ఒక విజన్ తో దేశంలో పరిపాలన అందిస్తుందని.. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపడుతోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్లో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ సమావేశం (దిశా) సమీక్షలో అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

- కేంద్రం నుంచి ఆయా పథకాలను వచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం డైవర్ట్ చేస్తుందనే ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.
- గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా కేంద్రం నుంచి వచ్చే నిధులను వారి అవసరాలకు అనుగుణ ఇతర స్కీములకు మళ్ళించారన్నారు.
- ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇదే పంథాలో వ్యవహరిస్తుంద న్నారు .
- పీఎం శ్రీ, ఉపాధి హామీ, ఆ బస్సు యోజన ల కింద వచ్చే నిధులను వారి అవసరాలకు ఇతర వాటికి మళ్ళించడం కరెక్ట్ కాదన్నారు.
- అమృత్ 2.0 కింద వచ్చి నిధులతో చేపట్టే పనుల్లో విపరీతంగా జాప్యం జరుగుతుందన్నారు.
- కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పథకాల అమలును అధికారులు రెండు కళ్ళలా భావించాలన్నారు.



- దురదృష్టవశాత్తు కొందరు ఒంటికన్ను తో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారన్నారు.
- పోస్టింగ్లు, కుర్చీల కోసం పైరవీలు చేస్తూ.. కొందరు నాయకుల వెనుక తిరుగుతూ కొందరు అధికారులు వారి విలువలను పోగొట్టుకుంటున్నారాన్నారు.

# విద్యార్థుల బ్యాంకు వివరాలు సవరించాలి

## జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సి కోడ్ వివరాలను సరిచేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి తెలిపారు. ఎం.టి.ఎఫ్. ప్రొసీడింగ్‌లను రూపొందించి ట్రెజరీకి అప్లోడ్ చేసే సమయంలో విద్యార్థుల ఈ-పాస్ బ్యాంకు ఖాతా లేదా ఐఎఫ్ఎస్‌సి కోడ్‌లో లోపాలు ఉన్నందున బిల్లులు అప్లోడ్ కావడం సాధ్యంకావడం లేదని వివరించారు. ఈ సమస్యలను నివారించేందుకు కళాశాలల యాజమాన్యాలు తమ విద్యార్థుల ఖాతా వివరాలను సరిచూసి, సవరణలు చేయాలని సూచించారు. ఎం.టి.ఎఫ్. బిల్లుల జారీ కోసం పూర్తి వివరాలతో జాబితాను ఆయా కళాశాలల కవరింగ్ లేఖలతో కలిసి నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్%-%5 గదిలో గల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయానికి సమర్పించాలని భాగ్యవతి తెలిపారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత


**శెనార్తి మీడియా, గన్నేరువరం:** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ సాయంతో గుర్తించి బాధితుడికి తిరిగి అందజేశారు గన్నేరువరం పోలీసులు. గన్నేరువరం మండలానికి చెందిన ఆసరి పర్శరాములు తన మొబైల్ ఫోన్ పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పీసీ పీ సాయిప్రేమ్ ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి బ్లాక్ చేశారు. ఆ ఫోన్ వినియోగంపై సాంకేతికంగా లభించిన సమాచారం ఆధారంగా పోలీసులు ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్ఐ జి. నరేందర్‌రెడ్డి, పీసీ సాయిప్రేమ్ ఫోన్‌ను బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు సీఈఐఆర్ ప్లాట్‌ఫామ్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.



# విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- అధికారులకు అందుబాటులో ఉండాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**నార్తి మీడియా, హుజురాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న మెంథా తుఫాన్ వర్షాల నేపథ్యంలో అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ఏ విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తిన వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆర్‌డిఓ, ఎంఆర్ఓ, మున్సిపల్ కమిషనర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రాష్ట్రం మొత్తం ప్రభావితమవుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని, సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రైతులు వ్యవసాయ బావుల వద్ద జాగ్రత్తలు పాటించాలని, తడిచేతులతో మోటార్లు ఆన్ చేయరాదని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే స్పందించి ప్రజలకు సహాయం అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు.



# రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వేముల

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని ఎంపీపీ పాఠశాల తెనుగుపల్లిలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న వేముల లక్ష్మీనారాయణను పీఆర్‌టీయూటీఎస్ సోషల్ మీడియా కమిటీ రాష్ట్ర సభ్యునిగా నియమితులయ్యారు. వేముల లక్ష్మీనారాయణ ప్రస్తుతం పీఆర్‌టీయూ కరీంనగర్ జిల్లా శాఖ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర సోషల్ మీడియా కమిటీలో చోటు కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర భిక్షం గౌడ్, గౌరవ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అయిలేని కరుణాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి సహా సంఘానికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల హక్కుల కోసం, పీఆర్‌టీయూ సంఘ బలపర్చడంలో ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.



# విద్యాభివృద్ధికి సహకరించండి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** కరీంనగర్‌లో జరిగిన 'దిశ' కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజి రెడ్డిలను బీజేపీ శంకరపట్నం మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ బుధవారం కలిశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల కొరత వంటి అంశాలపై వారితో సమగ్రంగా చర్చించారు. ప్రతి పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, పీఈటీ ఉపాధ్యాయులు, క్రీడా సామగ్రి ఏర్పాటు అవసరాన్ని ఎమ్మెల్సీల దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల ఆరోగ్యానికి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులకు సహకరిస్తామని ఎమ్మెల్సీలు హామీ ఇచ్చారని అనిల్ తెలిపారు.



## అమరవీరుల సంస్మరణలో రక్తదానం



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో బుధవారం ఇందారం మహి ఫంక్షన్ హాల్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బీఎంఎస్ ఆటో యూనియన్ అధ్యక్షుడు చెల్ల విక్రమ్ పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో పది మంది శ్రీరాంపూర్ ఆటో కార్మికులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు పొట్ట మధు, నస్పూర్ టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు పులి రాజేందర్, శనిగరపు రాయాలింగు, గోగుల మధు, బండి సన్నీ, శ్రీమూర్తి వెంకన్న, సంతోష్, రవి, చుంచు వెంకటేష్, చిప్పకుర్తి తిరుపతి, ఎండి సర్ధామ్, పసునూటి రాజు, ఎలుకటూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జ్‌లకు నియామక పత్రాలు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ చీఫ్ ఇబ్రాహిం శేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంచిర్యాల జిల్లా ఇన్‌ఛార్జ్‌లుగా దాగం శ్రీనివాస్, నాగుల కిరణ్‌బాబులకు నియామక పత్రాలు అందజేశారు. మంచిర్యాల జిల్లా ఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు స్వీకరించిన దాగం శ్రీనివాస్, నాగులకిరణ్‌బాబులకు శుభాకాంక్షలు తెలిపారు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ నిషాని రామచంద్రం, దాగిల్ల దయానంద్‌రావు, రాష్ట్ర నాయకుడు కాదాశి రవీందర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఈ ఉత్తమ్ జాడే

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మొంథా తుపాను ప్రభావంతో కుండపోత వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులందరూ అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. భారీ వర్షాల వలన విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని, ప్రతి వినియోగదారుడు అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో లేదా తడి ప్రదేశాల్లో తడిగా ఉన్న చేతులతో స్విచ్‌లు, మీటర్లు, ప్లగ్‌లు, వైర్లు తాకరాదని సూచించారు. ఎక్కడైనా తెగిపోయిన విద్యుత్ తీగలు కనిపిస్తే వాటి దగ్గరికి వెళ్లకుండా, వెంటనే సమీప లైన్‌మన్‌కి లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. తక్కువ ఎత్తులో వెళ్లే విద్యుత్ తీగల కింద వాహనాలు నడపకూడదని, పశువులను తీసుకెళ్లరాదని సూచించారు. పిల్లలను విద్యుత్ పరికరాల దగ్గర ఆడనీయకుండా జాగ్రత్త వహించాల్సిందిగా కోరారు. పొలాల్లో లేదా బోర్‌వెల్‌ల వద్ద పనిచేసేటప్పుడు తడి నేలపై నిలబడి విద్యుత్ మోటార్ స్విచ్‌లు ఆన్ లేదా ఆఫ్ చేయరాదని హెచ్చరించారు. విద్యుత్ పరికరాల్లో తడినీరు ఉంటే వాటిని వినియోగం నుండి తొలగించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలను తాకకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ తమ భద్రతను ప్రాధాన్యంగా తీసుకొని విద్యుత్ వినియోగంలో అప్రమత్తతతో ఉండాలని ఉత్తమ్ జాడే తెలిపారు.

## మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం




**శెనార్తి మీడియా, రామగుండం:** గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి, దుర్గా వాహిని శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ దుర్గా వాహిని కోట తిరుమల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృ శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కర్ర సాము, కత్తి సాము శిక్షణల ద్వారా మహిళలు స్వయంరక్షణ నేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న అత్యాచారాల నేపథ్యంలో మహిళలు, విద్యార్థినులు అప్రమత్తంగా, జాగ్రత్తగా, ధైర్యంగా ఉండి ప్రతిస్పందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

# జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై దృష్టి





- జిల్లా కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** అమృత్ 2.0 పథకం కింద జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పనను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సమావేశ మందిరంలో మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై మొదటి అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిటిసిపి సంయుక్త సంచాలకులు, అమృత్ 2.0 నోడల్ అధికారి అశ్విని, మంచిర్యాల డిటిసిపిఒ సంపత్, మున్సిపల్ కార్పొరేషన్ మరియు మందమర్రి మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నగర ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకొని, వచ్చే 20 సంవత్సరాల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసే విధంగా ప్రాదేశిక వివరాలు సేకరించాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీ సాయంతో భూ వినియోగ మ్యాప్‌లు రూపొందించి, జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్‌ను తాజా డేటాతో నవీకరించాలని తెలిపారు. సమగ్ర ప్రణాళిక ద్వారా భవిష్యత్తులో భూ వినియోగం, భవన నిర్మాణం, రవాణా, ప్రజా సేవలు, పచ్చదనం వంటి అంశాల్లో సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. 2051 నాటికి జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ఇండ్లు, త్రాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులు ప్రణాళికాబద్ధంగా అందించాలన్నారు. ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా, ఉద్యానవనాల అభివృద్ధి, ప్రజా రవాణా ప్రోత్సాహం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కలెక్టర్ వివరించారు. మంచిర్యాల మున్సిపల్ పరిధిలో 37.67 కిలోమీటర్లు, మందమర్రి పరిధిలో 38.98 కిలోమీటర్లలో డ్రోన్, సోషియో ఎకనామిక్ సర్వే పూర్తి చేసి, ముసాయిదా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సర్వే కార్యక్రమాల సమయంలో కన్సల్టెంట్లకు సహాయం అందించాలని, సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వార్డు అధికారులను బృంద సభ్యులుగా నియమించాలని ఆయన ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరక్షరాస్యులకు అక్షరాస్యం లక్ష్యం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షరమాల కార్యక్రమం 2025%-%26 అమలుపై జిల్లా వయోజన విద్యాశాఖ కార్యాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ.. ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లాలో 31,435 నిరక్షరాస్యులను గుర్తించి, వారికి విద్యాబోధన కోసం 3,013 వాలంటీర్ టీచర్లను ఎంపిక చేసి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి గ్రామ సంఘం నుండి ఇద్దరు ఒబీలకు, వీవోఏలకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సిఆర్పీలచే రేపటి నుండి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వివరించారు. శిక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, డివైఎస్ఓ హనుమంతరెడ్డి, జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, డీఆర్డీఏ కార్యాలయం డీపీఎం రామచందర్, ఎస్ఈఆర్పీ నుండి వచ్చిన సిఆర్పీలు తిరుమల, అమీనా, డిఆర్పీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : జిల్లా కలెక్టర్



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం ఆయన ఉప తహసీల్దార్ సంతోష్‌తో కలిసి మందమర్రి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం సమయానికి అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుద్ధమైన త్రాగునీటితో పాటు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి అర్థమయ్యే విధంగా బోధించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్

**శెనార్తి మీడియా, హుజురాబాద్:** రాష్ట్రంపై మొంథా తుఫాను ప్రభావం మరో రెండు రోజులపాటు కొనసాగనున్నదని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సూచించారు. చలి గాలుల తీవ్రత పెరుగుతున్నందున ముఖ్యంగా పత్తి, వరి కోతల సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణ శాఖ సూచనలను కచ్చితంగా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకెపి కేంద్రాల్లో కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా టార్పాలిన్ కవర్లు సమయానికి అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

### ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్ - బోనస్‌లు, అలవెన్సులు ఇవ్వాలని నిరసన



**శెనార్తి మీడియా, రామగుండం:** దరామగుండం ఎరవుల కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ న్యాయమైన హక్కులు నెరవేర్చాలని బుధవారం ప్లాంట్ గేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు అంబటి నరేష్ మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని, బోనస్‌లు, అలవెన్సులు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో పని చేసే సమయంలో సెల్‌ఫోన్లు, బైకులు అనుమతించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పని స్థలాల వద్దకు సెల్‌ఫోన్లు, బైకులు అనుమతించాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నిర్వాహకులు గమనించి వెంటనే పరిష్కరించాలని నాయకులు హితవు పలికారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసామని హెచ్చరించారు.

## జమ్మికుంట ప్రభుత్వ దవాఖానకు రూ. 150 కోట్లతో వైద్య పరికరాలు

- సీఎస్సార్ నిధులతో సమకూర్చిన కేంద్రమంత్రి బండి సంజయ్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**శెనార్తి మీడియా, జమ్మికుంట:** జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ రూ. 1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో 15 రకాల వైద్య పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బుధవారం దవాఖానను సందర్శించారు. పరికరాల వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. జమ్మికుంట ఆసుపత్రిలో వైద్యుల కొరత, పరికరాల లేమి, ఆరోగ్య సేవల లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రమంత్రి బండి సంజయ్ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఈ పరికరాలు అందించడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైద్యుల నియామకాలు చేసి, ఆసుపత్రి సౌకర్యాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.



